# కౌలు రక్షణలేని, కౌలు రైతుల సమస్యలు పరిష్కరించలేని

# పంట సాగుదార్ల హక్కుల చట్టం

**కౌలు** రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలు నేడు తీవ్రమైన చర్చకు దారితీసింది. రాష్ట్రంలో నానాటికీ కౌలురైతుల సంఖ్య పెరుగుతూనే ఉంది. నూతన ఆర్థిక విధానాల పర్యవసానంగా రైతాంగపు బలవన్మరణాల్లో కౌలు రైతుల సంఖ్య ఎక్కువగా ఉంది. కౌలు రైతు సమస్యలను సంస్థాగత రుణ సౌకర్యం అందకపోవడం వల్ల ఏర్పడిన సమస్యగా మాత్రంగా పరిగణిస్తూ పాలకవర్గాలు వ్యవహరిస్తున్నాయి. వీరికి రుణ సౌకర్యం అందించటం గురించి మాత్రమే చర్చలు జరుగుతున్నాయి. ఇందుకు వివిధ ప్రభుత్వాలు అనేక విధానాలు, ముసాయిదాలు, చట్టాలు తెచ్చాయి.

కొత్తగా ఏర్పడిన వైయస్ఆర్‌సిపి ప్రభుత్వం చేసిన పంటసాగుదార్ల హక్కుల చట్టం అందులో ఒకటి. 25-7-19న దీనికి ముసాయిదా బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టి దానికి చట్టబద్ధత కల్పించింది. ఈ చట్టం కౌలుదార్లకు మేలు చేస్తుందని, వారి సమస్యలు పరిష్కారమౌతాయని, పంట రుణాలతో సహా ప్రభుత్వం అందించే అన్నిరకాల సహాయం అందుతుందని, ఇది విప్లవాత్మక చట్టమని పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నట్లు ఈ చట్టం కౌలుదార్ల సమస్యలను పరిష్కరిస్తుందా? అంత ప్రాముఖ్యత ఈ చట్టంలో ఉందా! అన్న అంశాన్ని చర్చించేముందు కౌలు రైతుల పరిస్థితిని, దానికి కారణాలను తెలుసు కోవాల్సి ఉంది.

మనది ఇప్పటికీ వ్యవసాయక దేశమే. నూటికి 68 శాతం గ్రామీణ ప్రాంతంలోనే నివశిస్తున్నారు. వ్యవసాయమే గ్రామీణ ప్రజలకు ఉపాధి కల్పిస్తున్నది. 50 శాతంపైగా సేద్యపు భూమి కొద్దిమంది భూస్వాముల, సంపన్నులవద్ద బందీగా ఉంది. భూమినుండి పంటలు పండించే గ్రామీణ పేదలకు ఆ భూమిపై హక్కు లేకుండా పోయింది. వారు వ్యవసాయకూలీలుగా, కౌలుదారులుగా భూస్వాముల దోపిడీలో నలిగిపోతూ దుర్భర జీవితాలు గడుపుతున్నారు. భూస్వాముల దోపిడీ, పెత్తనాల క్రింద నలిగి పోతున్న రైతాంగ వీరోచిత పోరాటాల ఫలితంగా పాలకులు భూపరిమితి చట్టాలు చేశారు. ఏనుగులు దూరే కంతలతో చేసిన ఈ చట్టాలు మన భూస్వామ్య పెత్తందారీ వర్గాలు అవకాశం కల్పించడంతో భూసంస్కరణలు అమలు జరగలేదు. గ్రామీణ పేదలకు భూమి దక్కలేదు.

అనేక రైతాంగ పోరాటాల ఫలితంగా కౌలు రైతాంగానికి రక్షణ చర్యలు తీసుకోవాల్సిన పరిస్థితి ప్రభుత్వానికి ఏర్పడింది. ఆ నేపథ్యంలో వచ్చిందే 1956 ఆంధ్రా కౌలుదారీ చట్టం. ఈ చట్టం కౌలు రైతులకు పూర్తి రక్షణ కల్పించక పోయినా, కొన్ని హక్కులను కల్పించింది. అదే విధంగా హక్కులను హరించే అంశాలు ఉన్నాయి. చట్టం చేయకముందు కౌలుదార్లుగా ఉన్నవారందరూ కౌలుదార్లుగా గుర్తించబడతారు. చట్టం అమలులోకి వచ్చిన తర్వాత భూయాజమానికి, కౌలుదారునికి మధ్య ఒప్పందం జరిగితేనే కౌలుదారు గుర్తింపు లభిస్తుంది. కౌలు ఒప్పందం ప్రకారం నిర్దేశించిన కౌలు చెల్లిస్తూ ఆరు సంవత్సరాల కౌలు ఒప్పదం కొనసాగుతుంది. ఒప్పందం ముగియగానే మరో ఆరు సంవత్సరాలు కొనసాగుతుంది. కౌలుదారు భూమిని సాగుచేయకుండా, ఇతరులకు సబ్ కౌలుకి యిచ్చినా, కౌలు చెల్లించకపోయినా, ఒప్పంద అంశాలను ఉల్లంఘించినా ఒప్పందం రద్దు అవుతుంది. కౌలు ఒప్పందం జరిగిన తర్వాత కౌలుదారు ప్రభుత్వానికి, సహకార సంఘాలకు, భూ తనఖా బ్యాంకులతో సహా మరే ఇతర సంస్థలకైనా భూమిని తనకా పెట్టుకోవచ్చు లేదా తన ప్రయోనాలు తిప్పి లబ్ది పొందవచ్చు. యజమాని మారన పరస్పర అంగీకారంతో కుదుర్చుకొన్న షరతులు అంగీకారంతో అలానే కౌలుదారుగా కొనసాగ వచ్చు. యజమాని భూమిని అమ్మదలిస్తే మొదటి ప్రాధాన్యత కౌలుదారునికే ఇవ్వాలి. చట్టంలో ఈ పరిమిత హక్కులు కౌలుదారునికి ఉన్నా, వాటిని కాలరాసే వ్యతిరేక అంశాలు ఉన్నాయి. వాటిల్లో ముఖ్యమైనది, సొంత సేద్యం పేరుతో (అతని కుటుంబంలో ఎవరైనా సరే) కౌలుదారుని నుండి భూమిని భూయజమాని స్వాధీనం చేసుకోవచ్చు.

చట్టం చేసిన వారి వర్గ స్వభావాన్ని బట్టే, ఆ చట్టం రూపకల్పన, అమలు ఆధారపడి ఉంటుంది. 1956 కౌలుదారీ చట్టాన్ని చేసిన పాలకుల వర్గ ప్రయోనం భూస్వామ్యవర్గ ప్రయోజనాలను పరిరక్షించటమే. అందుకే అనేక లొసుగులు కల్పించి, ఆచట్టం నిష్ప్రయోజనమైన, అలంకార ప్రాయ చట్టంగా మార్చారు.

చట్టానికి ముందు పట్టణాల్లో ఉద్యోగాలు చేసుకొనేవారి భూములను, భర్తలను కోల్పోయి జీవిస్తున్నవారి భూములను, వ్యవసాయం చేయలేని బ్రాహ్మణ కుటుంబాల భూములను సాగుచేస్తున్న కౌలుదార్లకు మాత్రమే కౌలు హక్కులు లభించాయి. భూస్వాములు, సంపన్న వర్గాల భూములు కౌలు ఒప్పందంలోకి రాలేదు. కౌలుకి భూమి కావాలంటే కౌలు ఒప్పందం మాట కౌలుదారుని నోటినుండి రాగూడని విధించిన షరతుకు కౌలుదారు ఒప్పుకోక తప్పని పరిస్థితి ఏర్పడింది. నోటిమాట కౌలు విధానమే అమలు జరిగింది

కౌలు విధానంలోనూ అనేకమార్పులు సంభవించాయి. మొదట భూస్వాముల భూములు పనులు చేసినందుకుగాను, వ్యవసాయకూలి, పేదరైతులకు పరిమితమైన భూమిని సొంత సేద్యంకోసం భూస్వామి యిచ్చేవాడు. తర్వాత పాలు పద్ధతి

అమల్లోకి వచ్చింది. పెట్టుబడి భూస్వామే పెట్టేవాడు. ఆతర్వాత నికర కౌలు విధానం అమలైంది. దాన్ని ఖచ్చితంగా కౌలుదారు చెల్లించాల్సిందే. ప్రస్తుతం రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో కౌలు డబ్బు రూపంలోకి పరివర్తన చెందింది. ముందుగానే కౌలు డబ్బులు చెల్లించాలి. కౌలు విధానంలో వచ్చిన మార్పులన్నీ భూస్వాములకు అనుకూలంగా కౌలుదార్లకు నష్టంగాను మారింది.

సరళీకృత ఆర్థిక విధానాల ఫలితంగా సేద్యపుఖర్చులు పెరిగి, పంటలకు న్యాయమైన ధరలు లభించక నష్టపోయిన మధ్యతరగతి రైతాంగం పేదరైతులుగా మారటం, పేదరైతులు భూమిహీనులవటం మూలంగా వ్యవసాయ కూలీల సంఖ్య పెరగటం, అదే సమయంలో భూమి పెద్దఎత్తున చేతులు మారి సంపన్నవర్గాల చేతుల్లోకి వెళ్లటం, పారిశ్రామిక వృద్ధి కుంటినడక నడుస్తూ ప్రత్యామ్నాయ ఉపాధి లభించక వ్యవసాయకూలీలు, పేదరైతులు కౌలు సేద్యానికి తప్పనిసరిగా మళ్లవలసి వచ్చింది. దాని ఫలితంగా కౌలు భూమికి డిమాండ్ పెరిగింది. కౌలు రేట్లు పెరుగుతున్నాయి. ఇది భూ యజమానులకు లాభదాయకమైంది.

కౌలు విధానం డబ్బు రూపంలోకి మారటం, కౌలు రేట్లు పెరుగుతూ ఉండటం, సేద్యపు ఖర్చులు పెరగటంవలన కౌలుదార్ల లోనూ మార్పులు చోటు చేసుకొన్నాయి. ఆర్థిక, సాంఘిక సంబంధాలు స్థోమతులేని కౌలు దారులు కౌలు సేద్యంనుండి తప్పుకోవాల్సి వస్తున్నది. కొందరు మధ్యతరగతి, ధనిక రైతులు కూడా అదనంగా (కొన్ని ప్రాంతాల్లో) కౌలు రూపంలో సాగుచేస్తున్నారు. ఇది వ్యవసాయ సంక్షోభపు తీవ్రతను తెలియచేస్తున్నది.

ప్రభుత్వ విధానాల ఫలితంగా కౌలురైతులు సంక్షోభం సుడిగుండంలో కొట్టుమిట్టాడు తున్నారు. వీరికి కౌలుదారీ చట్టం అమలుకాదు. పంటరుణాలు అందవు, సేద్యపు ఖర్చులు భరించలేని భారంగా మారుతున్నది. ఎటువంటి ప్రభుత్వ సహాయం అందదు. వడ్డీ వ్యాపారుల కబంధ హస్తాల్లో చిక్కుకొంటున్నారు. పంటలకు న్యాయమైన ధరలు లభించక అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. అప్పులు తీర్చటానికి ఉన్న కొద్దిపాటి ఆస్తులు అమ్మినా, అవితీరక అవమానాలు భరించలేక బలవన్మరణాలకు పాల్పడుతున్నారు.

ఇలాంటి దారుణ పరిస్థితుల్లో ఉన్న కౌతు రైతులు, కౌలుదారీ చట్టాన్ని అమలు చేయాలను సంస్థాగత పంట రుణాలు, సబ్సిడీలు, పంటనష్ట పరిహారాలు ఇవ్వాలని ఆందోళన మార్గం చేపట్టారు. వీరి ఆందోళనకు రైతుకూలీ సంఘాలు, రైతుల శ్రేయస్సును కోరుకొనే ప్రజాస్వామికవాదులు పూర్తి మద్దతును ప్రకటించింది. ఆనాటి చంద్రబాబు ప్రభుత్వం వీరి ఆందోళనను అరెస్టులతో అణగదొక్కే చర్యలు అమలు పర్చింది. అయినా కౌలు రైతుల ఆందోళన ఉధృతరూపం దాల్చింది.

కౌలురైతుల సంక్షోభ తీవ్రత, ఆందోళనోద్యమ నేపథ్యంలో 2004 సంII సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మెజారిటీ సాధించి రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రభుత్వం ఏర్పడింది. కౌలు రైతుల సమస్యలు పరిష్కరిస్తానని, పంట రుణాలు ఇస్తానని, అందుకు బ్యాంక్‌లను ఒప్పించానని, బ్యాంక్‌లకు వెళ్లి రుణాలు తీసుకోవచ్చని రాజశేఖర్‌రెడ్డి ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం మాటలు నమ్మి బ్యాంక్‌లకు వెళ్ళిన కౌలు రైతులకు చేదు అనుభవం ఎదురైంది. కౌలు ఒప్పంద పత్రాలు లేకుండా పంట రుణాలు ఇవ్వటం సాధ్యంకాదని ఖరాఖండిగా తేల్చి చెప్పాయి. కౌలు రైతుల ముఖాలు వెలవెలబోయాయి.

రాష్ట్ర ప్రభుత్వ మోసపు ప్రకటనపై రైతుల్లో ఆగ్రహం పెల్లుబికింది. దీన్ని గమనించిన రాజశేఖర్‌రెడ్డి వారి ఆగ్రహాన్ని చల్లార్చేందుకు జాయింట్‌లయబిలిటీ (జెఎల్‌బి) గ్రూపులను ఏర్పాటు చేసి బ్యాంక్‌లనుండి అప్పు యిప్పిస్తానని ప్రకటించారు. ఒక్కో గ్రూపులో 4 నుండి 10 మంది కౌలురైతులు చేర్పించింది. ఈ గ్రూపుల్లో చేరేవారు షేరుధనం చెల్లించాలి. ఇలా చెల్లించిన షేరు ధనం బ్యాంకుల్లో పెద్దమొత్తంలో జమైంది. దీనికి బ్యాంక్‌లు కొంత చేర్చి, ఆ గ్రూపులకు అప్పులు ఇచ్చింది. రైతుల డబ్బును రైతులకే బ్యాంకులు అప్పు యిచ్చి వడ్డీ రూపంలో లాభం పొందాయి. ఈ గ్రూపులు డ్వాక్రా మహిళా గ్రూపుల్లాంటిదే. ఇలాంటి అప్పులు కూడా 10 శాతానికి మించి కౌలు రైఔతులకు అందలేదు. ఆచరణలో ఈ విధానం విఫలమైంది.

రాజశేఖరరెడ్డి మరణానంతరం కిరణ్ కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. కౌలు రైతుల ఆందోళన కొనసాగుతూ ఉండటంతో బ్యాంక్‌లనుండి కౌలు రైతులకు రుణాలు అందించేందుకు బ్యాంక్‌లో కౌలు రైతుల రుణ ముసాయిదా బిల్లును ప్రకటించి రెవిన్యూ డివిజన్ల స్థాయిలో దాన్ని రైతులు, కౌలుదార్లు ఈ చర్చల్లో మొదటినుండి కౌలుదారీ చట్టాన్ని మొదట్నుండీ వ్యతిరేకించినవారే పాల్గొన్నారు. బ్యాంక్‌ల నుండి చర్చలకు పెట్టింది. బ్యాంక్‌లనుండి పంటరుణాలు తీసుకొనేందుకు రుణ అర్హత కార్డులు ఇవ్వనున్నట్లు ముసాయిదాలో పేర్కొంది. దీనికి రైతుల అనుమతి అవసరం లేదని పేర్కొంది. తమ అనుమతి లేకుండా కార్డులు ఇస్తే కోర్టుకు వెళ్తామని రైతులు ప్రకటించారు. రుణ అర్హత కార్డులకు బ్యాంక్‌ల్లో ఎటువంటి అర్హత లేకుండా పోయింది. 2011 మార్చి, ఏప్రియల్ నాటికే రుణ అర్హత కార్డులు అందచేయాల్సి ఉండగా, 8-6-11న హడావుడిగా కౌలురైతుల లైసెన్స్ ఆర్డినెన్స్‌ను తీసుకొచ్చి గవర్నర్ ఆమోదముద్ర వేయించి, ఆ తర్వాత చట్టంగా మార్చింది. దీనిలో ఉన్న ఆదేశిక సూత్రాల ప్రకారం కౌలు ఒప్పందం ఒక సంవత్సరం మాత్రమే. భూమిపై కౌలుదారునికి ఎటువంటి హక్కులు ఉండవు. పంట పండించు కోవటానికి, పంట రుణం ఇతర సబ్సిడీలు పొందే హక్కుమాత్రమే ఉంటుంది. ప్రతి సంవత్సరం కౌలు ఒప్పదం జరగాలి. అది రైతు ఇష్టంమీద ఉంటుంది. ఈ చట్టంలో కౌలురైతులకు ఎటువంటి కౌలుహక్కులు ఉండవు. 90 శాతం పైగా రైతుల అంగీకారం లేకుండానే రుణ అర్హత లైసెన్స్ కార్డులు ఇవ్వటం జరిగింది. రైతుల అనుమతి లేని ఈ కార్డులకు బ్యాంక్‌లు రుణాలు ఇవ్వలేదు. రైతుమిత్ర గ్రూపులు కొన్నింటికి అప్పు రూపేణా బ్యాంక్‌లు అందించాయి.

1956లో కౌలుదారీ చట్టం చేసిన దగ్గర నుండి భూస్వాములు, ధనికరైతులు దాన్ని రద్దుచేయాలని పాలకులపై ఒత్తిడి తెస్తున్నారు. 2011లో ప్రవేశపెట్టి కౌలురైతుల ముసాయిదా బిల్లుపై అభిప్రాయసేకరణ సందర్భములో కూడా వారు ఇదే విధంగా

డిమాండ్ చేశారు. కౌలు రైతుల లైసెన్స్ చట్టం ద్వారా కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వం కౌలుదారీ చట్టాన్ని అటకెక్కించి భూస్వాముల, ధనికరైతుల డిమాండ్‌ను నెరవేర్చ పూనుకొంది.

ఏ పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉన్నా కౌలు రైతుల సంక్షోభం పెరుగుతూనే ఉంది. వారి ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి. పాలక పార్టీలన్నీ వారి ఎడల మొసలి కన్నీరు కారుస్తూ, వారి సంక్షోభానికి తామే కారణం అన్న వాస్తవాన్ని మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నాయి.

2019 సాధారణ ఎన్నికలు దగ్గర పడిన సందర్భములో వైఎస్‌ఆర్‌సిపి అధ్యక్షులు జగన్ మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప పాదయాత్ర ప్రారంభించాడు. ఈ పాదయాత్ర సందర్భములో కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఏకరవు పెట్టాడు. తమ పార్టీ అధికారంలోకి వస్తే పంటరుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీతోపాటు అన్ని విధాలా వారికి సహాయం అందిస్తామని ప్రకటించాడు.

సాధారణ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఘోర పరాచయం పొందగా, వైఎస్‌ఆర్‌సిపి పూర్తి మెజారిటీతో గెలుపొంది జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. తొలి అసెంబ్లీ సమావేశాల్లో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అనేక పథకాలు, చట్టాలు ప్రవేశ పెట్టింది. వాటిల్లో పంటసాగు హక్కుదార్ల చట్టం ఒకటి. ఈ చట్టం చరాత్రాత్మకమైందని, కౌలుదార్లకు మేలు చేస్తుందని ప్రభుత్వం పేర్కొంది.

ఈ చట్టంలోని అంశాలను పరిశీలిస్తే 2011 కౌలుదార్ల లైసెన్స్ చట్టానికి, వైసిపి ప్రభుత్వం చేసిన పంట సాగుదార్ల హక్కుల చట్టానికి మధ్య స్వల్పతేడాలు తప్ప మౌళికంగా ఎటువంటి తేడా లేదు. 2011 చట్టంలో కౌలు ఒప్పందం ఒక సంవత్సరం కాక, పంట సాగుదార్ల హక్కుచట్టంలో కౌలు ఒప్పందం 11 నెలలు. 2011 చట్టంలో రుణ అర్హత కార్డులు ఇస్తే, ప్రస్తుత కొత్త చట్టంలో సాగుదార్ల హక్కుల కార్డు ఇస్తారు. మార్పు పేరులో మాత్రమే. 2011చట్టంలో భూయజమానికి, కౌలుదారునికి మధ్య జరిగిన ఒప్పందం జరిగితేనే ఆకార్డులకు చట్టబద్ధత ఏర్పడి రుణ అర్హతకు ఆమోదయోగ్య మౌతుంది. నేటి కొత్త చట్టంలోనూ కౌలుదారునికి, భూయజమానికి ఒప్పందం జరిగితేనే కౌలు రైతులకు, సాగు హక్కుల కార్డు ఇవ్వబడుతుంది. రెంటిలోనూ భూయజమాని అంగీకారం ప్రధానమైంది. రెండు చట్టాల్లోనూ పంట పండించుకోవటానికి, ఇన్‌పుట్ సబ్సిడీ, పంటరాయితీలాంటి ప్రభుత్వం అందించే సహాయం పొందటానికి మాత్రం కౌలుదారునికి హక్కు ఉంటుంది. భూమిపై ఎటువంటి హక్కు ఉండదు. రెండు చట్టాల్లోనూ ప్రతి సంవత్సరం కౌలు ఒప్పందం చేసుకోవాల్సిందే. కౌలుదారుని మార్చుకొనే, కొనసాగించే హక్కు భూయజమానిదే. ఒప్పంద గడువు ముగిసిన వెంటనే తాకట్టు భారంలేకుండా కౌలుదారు భూమిని ఖాళీ చేయాలి. పంటకోత తర్వాత బ్యాంకులు లేదా ఆర్థిక సంస్థలనుండి తీసుకొన్న పంటరుణాన్ని పూర్తిగా చెల్లించాలి. పసాగుదారుని నుండి ఏదైనా రుణాన్ని రాబట్టేందుకు షెడ్యూల్డ్ భూమిని బ్యాంక్‌లు జప్తు చేయకూడదు. మిగతా అంశాలన్నీ ఒప్పందం జరిగిన తర్వాత పాటించ వలసినవి మాత్రమే చట్టంలో ఉన్నాయి.

వైసిపి ప్రభుత్వం తెచ్చిన 2019 సం॥ కొత్త చట్టంలోనూ కౌలురైతులకు బ్యాంక్‌లు రుణం ఇచ్చేందుకు సంబంధించిన నిబంధనలను పేర్కొనలేదు. బ్యాంక్‌లు కోరేదానిగురించి రాష్ట్ర ప్రభుత్వం చెప్పే సమాధానం ఏమిటి? రాష్ట్ర ప్రభుత్వం చేసిన చట్టాన్ని ఆ బ్యాంక్‌లు ఆమోదించాలన్న నిబంధన ఏమీలేదు. వాటి నిబంధనల ప్రకారం అవి వ్యవహరిస్తాయి. 2011 చట్టాన్ని బ్యాంక్‌లు పరిగణలోకే తీసుకోలేదు. కొత్తగా చేసిన పంట సాగుదార్ల హక్కుల చట్టం ఎడల బ్యాంక్‌ల వైఖరి అదే విధంగా ఉ ంటుంది. బ్యాంక్‌లకు కావాల్సింది రిజిస్టర్ డాక్యుమెంట్లు లేదా కౌలు ఒప్పంద పత్రం. కైజెలు రైతులు పంటరుణం పొందే సమస్య ఇందులోనే ఉంది. కౌలు రైతులకు రుణాలు యిచ్చే విషయంలో బ్యాంక్‌లకు రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి హామీ ఇవ్వలేదు. ఎటువంటి ఆధారం లేకుండా కౌలు రైతులకు బ్యాంక్‌లు రుణాలు ఇవ్వవు.

పంటసాగుదార్ల హక్కుల చట్టం వలన భూయజమానులకు ఎలాంటి నష్టం జరగదని, పంట పండించుకోవటానికి, పంట రుణం, రైతు భరోసాలాంటి సహాయం పొందటానికే పరిమిత మైందని ప్రభుత్వం చెబుతున్నది. భూయజమానికి కూడా రైతు భరోసా ద్వారా 1,500 రూ. అందుతుందని, భూమిపై కౌలుదారునికి ఎలాంటి హక్కు ఉండదని, ఆవిధంగా చట్టంలో పేర్కొన్నామని, కౌలు ఒప్పంద పత్రంలో ఈ అంశం ఉండదని ప్రభుత్వం వివరణ యిస్తున్నది.

వైసిపి ప్రభుత్వం పంట సాగుదార్ల హక్కుల చట్టం ద్వారా కార్డులు అందించిన తర్వాత కౌలుదార్లకు పంటరుణాలు అందించేందుకు అదనపు నిధుల కేటాయింపులు ఏమీ వుండవు. ప్రస్తుతం అందిస్తున్న నిధుల నుండే వారికి ఇవ్వాల్సి ఉంటుంది. వాటినుండి కౌలురైతుకు ఇవ్వటం ఉంటుంది. అసలే పల్చగా ఉన్న పాలల్లో ఇంకా నీళ్లు కలిపి కౌలు రైతులకు ఇస్తారన్నమాట.

ప్రభుత్వం చెబుతున్న దాన్ని భూ యజమానులు విశ్వసించడంలేదు. కౌలు ఒప్పందానికి ముందుకు రావడంలేదు. తన భూమిని హామీగా తీసుకొనే కౌలురైతులకు బ్యాంకులు రుణాలు ఇస్తాయి. కౌలురైతు బ్యాంకురుణం చెల్లించకపోతే పరిస్థితి ఏమిటని చిన్న, సన్నకారురైతులు ఆందోళన చెందు తున్నారు. సరైన కారణాలతో కౌలురైతులు బ్యాంకురుణం చెల్లించలేని పరిస్థితి ఉంటే, దానికి ప్రభుత్వం బాధ్యత వహిస్తుందని చెబితే భూయజమానికి నమ్మకం ఏర్పడే అవకాశం ఉంది. అలాంటి మాటలు ప్రభుత్వంనుండి రావటంలేదు. కౌలు ఒప్పందం వలన చట్ట పరమైన సమస్యలు ఏర్పడతాయన్న భయం కూడా వెంటాడుతున్నది. భూస్వాములు, సంపన్న వర్గాలు కౌలు ఒప్పందానికే ఇష్టపడరు.

కొత్తచట్టంలో ప్రమాదకరమైన అంశం ఇమిడి ఉంది. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన పంట సాగుదార్ల, హక్కు ముసాయిదా

బిల్లులో 1956 కౌలుదారీ చట్టాన్ని, 201చట్టాన్ని రద్దుచెయ్యాలని పేర్కొంది. బిల్లు ఆమోదం పొందటంద్వారా 1956 కౌలుదారీచట్టం రద్దు అయ్యింది. భూస్వాముల, ధనికరైతుల, సంపన్న వర్గాల కోర్కెను వై.సి.పి. ప్రభుత్వం ఈ చట్టంద్వారా నెరవేర్చింది.

ఉద్యమంద్వారా కౌలురైతులు సాధించుకొన్న 1956 ఆంధ్రా కౌలుదారీ చట్టాన్ని ప్రారంభం నుండి అమలుకాకుండా పాలకులు నిర్లక్ష్యంచేసే విధానాన్ని చేపట్టారు. చట్టాన్ని అలంకార ప్రాయంగా మార్చివేశారు. ఈ చట్టాన్ని పాలకులు అమలుజరిపి ఉంటే కౌలురైతులకు కొన్ని హక్కులు ఏర్పడిఉండేవి. వారి సంక్షోభం ఇంత తీవ్రంగా ఉండేదికాదు.

వ్యవసాయ సంక్షోభం కౌలురైతులపై తీవ్రప్రభావం చూపింది. ప్రభుత్వ విధానాల ఫలితంగా కౌలుసేద్యం భారంగా మారింది. అనేక సమమస్యలు వీరిని చుట్టుముట్టాయి. సమస్యల పరిష్కారం కోసం వారికి ఉద్యమ బాట తప్పలేదు. ఆ ఉద్యమాలను దారి మళ్ళించేందుకు 1956 కౌలుదారీ చట్టం పేరుఎత్తకుండా నిరుపయోగమైన విధానం చేపట్టారు. అందులో భాగమే 20 సం॥ కౌలుదార్ల లైసెన్స్ చట్టం, 2019 పంట సాగుదార్ల హక్కులచట్టం. ఈ చట్టాలు కౌలు రైతులకు ఎటువంటి కౌలుహక్కులు కల్పించక పోవటం వలన వారి సమస్యలకు పరిష్కారం చూపలేకపోయాయి. హక్కులు కల్పించని చట్టాలు కౌలురైతులకు నిరుపయోగమే.

1956 కౌలుదారీ చట్టాన్ని అమలు జరపటానికి పాలకులు కుంటిసాకులు చెబు తున్నారు. ఈ చట్టంవలన భూయజమానులు కౌలుకి భూములు ఇవ్వటానికి ముందుకు రావటంలేదని, కౌలు ఒప్పందాన్ని వ్యతిరేకి స్తున్నారని ఫలితంగా కౌలుదార్లు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. అందువలన వారి సమస్యలు పరిష్కరించటానికి కొత్త చట్టాలు అవసరమయ్యాయని పాలకులు చెబుతున్నారు. కొన్ని రాజకీయపార్టీలు, రైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాలు పాలకులకు వంత పాడుతున్నాయి. పాలకులు చేసిన చట్టాలను కీర్తిస్తున్నాయి. చట్టం చేసే పాలకులకు, ఆ చట్టం అమలులో ఎదురయ్యే సమస్యలను ఎదుర్కొనే విధానం తెలిసే ఉంటుంది. 1956 కౌలుదారీ చట్టం చేసిన పాలకులకు అది తెలుసు. కౌలుదారీ చట్టం అమలులో ఎదురైన సమస్యలు ఆనాటి పాలకులు సృష్టించినవే. అందుకువారి వర్గ స్వభావం కారణం. పాలకవర్గ స్వభావం రైతులకు అనుకూలమైతే భూయజమాని ఎవరు, కౌలురైతు ఎవరు అన్నది గుర్తించి చట్టాన్ని వర్తింపచేయటం కష్టమేమి కాదు.

గ్రామీణ పేదలకు సేద్యం చేసుకోవటానికి భూమి లేకపోవటమే ఉపాధికోసం వారు కౌలు రైతులుగా మారుతున్నారు. ఈ పరిస్థితి మారాల్సి ఉంది. సేద్యానికి అవసరమైన భూమి భూస్వాముల, సంపన్నవర్గాల వద్ద పోగుపడి ఉంది. భూ సంబంధాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి, ఆ సంబంధాలను బ్రద్దలు కొట్టే విప్లవ సంస్కరణల ద్వారా, గ్రామీణ పేదలకు భూములు పంచటం ద్వారా, కౌలుదారులు, భూయజమానులుగా మారుతారు. ఇదే కౌలు రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం. ఈ పని ప్రజావ్యతిరేక పాలకులు చేయరు. గ్రామీణ పేదలే సాధించుకోవాలి.

వై.సి.పి. ప్రభుత్వం చేసిన పంటసాగుదార్ల హక్కుల చట్టం ద్వారా కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కావు. దీన్ని కౌలు రైతులు అర్థం చేసుకొని 1956 కౌలుదారీ చట్టాన్ని మెరుగుపర్చి కౌలుదార్లకు పూర్తి రక్షణ కల్పించేదిగా సవరించి అమలు జరపాలని, విప్లవ భూసంస్కరణలు అమలు జరపాలనీ కౌలుదార్లతో సహా గ్రామీణ పేదలందరూ ఉద్యమించాలి.

ooo